## దీపాల కాంతుల్లా ప్రతి ఇల్లు వెలుగొందాలి

- ఉమ్మడి జిల్లా ప్రజలకు మంత్రి జగదీశ్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు

సూర్యాపేట టౌన్, నవంబర్ 11 : దీపాల కాంతుల వలె ప్రతి ఇల్లు వెలుగొందాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు శనివారం ఓ ప్రకనటలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమావాస్య చీకట్లను తొలగిస్తూ చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకునే దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. దీపాల కాంతుల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా వేడుకలు జరుపుకోవాలని పేర్కొన్నారు.



సూర్యాపేట టౌన్ : సూర్యాపేటలోని 17వ వార్డులో ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

## 60 ఏండ్లలో జరుగని అభివృద్ధి తొమ్మిదిన్నరేండ్లలో

- సంక్షేమాభివృద్ధి కొనసాగింపునకు మరోమారు ఆశీర్వదించండి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

బొడ్రాయిబజార్, నవంబర్ 11 : గత ప్రభుత్వాలు 60 ఏండ్లలో చేయని అభివృద్ధిని బీఆర్ఎస్ పాలనలో కేవలం తొమ్మిదిన్నరేండ్ల కాలంలో మంత్రి జగదీశ్‌రెడ్డి చేసి చూపించారని మంత్రి సతీమణి సునీత అన్నారు. ప్రజలు గమనించి సంక్షేమాభివృద్ధి కొనసాగింపునకు కారు గుర్తుకు మరోమారు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని 43వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం కేసీఆర్ అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు బత్తుల ఝాన్సీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బత్తుల రమేశ్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

### మరోమారు కారు గుర్తుకు ఓటు..

సూర్యాపేట టౌన్ : 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించి ఓట్లు వేసి గెలిపిస్తే ఎంతటి అభివృద్ధి జరిగిందో అంతా కండ్ల చూస్తున్నామని.. పూర్తిస్థాయిలో అభివృద్ధికి మరోమారు ఆశీర్వదించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత ప్రజలను కోరారు. జిల్లా కేంద్రంలోని 17, 40వ వార్డుల్లో గల అంబేద్కర్‌నగర్‌లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జగదీశ్‌రెడ్డిని హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకుని నిరంతర అభివృద్ధి పాలన కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతలపాటి భరత్ మహాజన్, ఎస్కే తాహేర్ పాషా, నాయకులు కీసర వేణుగోపాల్ రెడ్డి, సల్మా మస్తాన్, సారంగుల కరుణశ్రీ, రాచూరి రమణ, డిల్లీ పావనీ, వాంకుడోతు పద్మ, విజయ చక్రూనాయక్ పాల్గొన్నారు.



చివ్వెంల : ఉండ్రుగొండలో ప్రచారం చేస్తున్న యువకులు

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు బండమీదిచందుపట్ల, వట్టిఖమ్మంపహాడ్, వల్లభాపురం, గుంజలూరు, జి తిరుమలగిరి, ఉండ్రుగొండ గ్రామాల్లో బీఆర్ఎస్ సూర్యాపేట నియోజక వర్గ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తరపున మండల యువకులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

# వారిది పదవుల కొట్లాట..మాది సంక్షేమ కాంక్ష

- బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి
- తొమ్మిదిన్నరేండ్లలో మారిన గ్రామాలు, పట్టణాల రూపురేఖలు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆకలిచావులు, ఆత్మహత్యలు
- ఎన్నికల హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, మంత్రి గుంటకండ జగదీశ్‌రెడ్డి
- పెన్‌పహాడ్ మండలంలో ఎన్నికల ప్రచారం



అనంతారం గ్రామ ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్, నవంబర్ 11 : 60 ఏండ్ల కాంగ్రెస్ పాలన, 15 ఏండ్ల టీడీపీ, బీజేపీ సమైఖ్య పాలనలో తెలంగాణ ప్రాంతం ఎడారిగా మారి ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలే దర్శనమిచ్చేవని బీఆర్ఎస్ సూర్యాపేట నియోజక వర్గ అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆనాటి గుర్తులను తెలంగాణ ప్రజలు ఇప్పటికీ మరవలేదని చెప్పారు. పదవులు లేక తోడేళ్ల అవతారమెత్తిన కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు వేస్తే వాళ్లు పదవులు అనుభవిస్తారే తప్పా సమాజ అభివృద్ధి, ప్రజల సంక్షేమం గాలికొదిలేస్తారన్నారు. అదే బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అభివృద్ధి కొనసాగింపుతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతూనే ఉంటాయని తెలిపారు. శనివారం మండలంలోని అనంతారం, అన్నారం, నారాయణగూడెం, నాగులపహాడ్ గ్రామాల్లో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదవులే ముఖ్యమని భావిస్తున్న కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేద్దామా ? లేదా మన పథకాల కోసం ఓటు వేద్దామా తెలంగాణ ప్రజలు, సూర్యాపేట నియోజక వర్గ ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కాంగ్రెస్ పాలనలో సూర్యాపేటలో ఊరూరుకు కొట్లాటలు, పోలీస్ స్టేషన్ కేసులు తప్పా ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లి ప్రజా ప్రతినిధులు ఊరు అభివృద్ధి కోసం పనులు అడిగిన దాఖలాలు లేవన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్ర ఏర్పడక ముందు ఏ ఊర్లో చూసినా దుమ్ము దూళీ, మోకాల్లోతు బురద రోడ్లే దర్శనమిచ్చేవని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రాకతో కేవలం 10 ఏండ్లలో అన్ని గ్రామాలు, తండాలు సీసీ రోడ్లతో కళకళలాడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అప్పటి ఎమ్మెల్యేలు వేదాసు వెంకయ్య, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హయాంలో కుంగిన దోసపహాడ్ బ్రిడ్జికి ఏడేండ్లైనా మరమ్మతులు చేయలేదని దుయ్యబట్టారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏడు నెలల్లోనే బ్రిడ్జి పూర్తి చేసి మండల ప్రజలకు అంకితం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. విద్య, వైద్యం అభివృద్ధే తన లక్ష్యమని అందులో భాగంగానే ఇప్పటికే మెడికల్ కాలేజీ, ఐటీ టవర్ సూర్యాపేటలో నెలకొల్పినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రైతుకు రైతు బీమా, ఉచిత కరెంట్, రూ.లక్ష రుణమాఫీ అందించి ఆదుకుంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. గత ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలే కాకుండా ప్రజల అవసరాలు గుర్తించి అప్పటికప్పుడు రూపొందించుకున్న సంక్షేమ పథకాలు అమలు చేసి తెలంగాణ ప్రజలను ఆదుకున్నట్లు వెల్లడించారు. ప్రజా సంక్షేమం కోరి ఇంత మంచి పథకాలు తీసుకువచ్చి పాలన అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసుకుందామా ? లేదా తోడేళ్ల మాదిరి అధికారం కోసం అర్రులు చాస్తున్న కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేసి బంగారు తెలంగాణను చీకటిమయంగా మార్చుకుందామా ప్రజలే తేల్చుకోవాలని పేర్కొన్నారు.

### బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు..

మండలంలోని మహ్మదాపురం, నారాయణగూడెం, నాగులపహాడ్‌కు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

### బీఆర్ఎస నాయకుడి కుటుంబానికి పరామర్శ..

మండలంలోని దోసపహాడ్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సద్దల యాదగిరి ఇటీవల మృతి చెందాడు. దశదిన కర్మకు మంత్రి హాజరై యాదగిరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీ మామిడి అనితాఅంజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగేంధర్, బీఆర్ఎస్ నాయకులు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకి రాంరెడ్డి, మండాది నగేశ్, మామిడి అంజయ్య, తూముల ఇంద్రసేనారావు, మిర్యాల వెంకటేశ్వర్లు, పొదిల నాగార్జున, దంతాల వెంకటేశ్వర్లు, మస్తాన్, సర్పంచులు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాయిలీ లక్ష్మి, ధన్యాకుల కోటమ్మ, మీసాల రమణ, ఎంపీటీసీ మామిడి రేవతి, కట్ల నాగార్జున, నకిరేకంటి భార్గవ్, కొండ జానకిరాములు పాల్గొన్నారు.

### వృద్ధులతో మంత్రి మాటామంతి..

మండలంలో ఏకబిగిన ప్రచారాలతో కాస్త అలసట చెందడంతో మంత్రి అనంతారం ప్రచారంలో స్వల్ప విరామం తీసుకున్నారు. అనంతారం ప్రచారంలో ఉండగా విరామం తీసుకుని అక్కడ పక్కనే ఉన్న ఇంటి ముందు అరుగుపై సేదతీరారు. ఆ సమయంలో అరుగుపై ఉన్న వృద్ధులు, చుట్టూ చేరిన మహిళలతో కాసేపు ముచ్చటించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేస్తే ఇలాగే సంతోషంగా ఉంటారని చెప్పారు. ఓ సామన్యుడిలా మంత్రి తమలో కలిసిపోవడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అనంతారం ప్రచారం ర్యాలీలో పాల్గొన్న అశేష జనం

## ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు

- ఎస్పీ రాహుల్ హెగ్డే
- యాక్షన్ ప్లాన్‌పై పోలీస్ అధికారులకు శిక్షణ

సూర్యాపేట సిటీ, నవంబర్ 11 : ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. విధుల నిర్వహణలో పోలీస్ సిబ్బంది చేయాల్సిన, చేయకూడని విధి విధానాలపై శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి ఎస్పీ పలు సూచనలు చేశారు. ఓటర్లకు రక్షణ కల్పించడం, ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరుగకుండా చూడడం పోలీస్ ముఖ్య విధి అన్నారు. ఎన్నికల విధులపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎన్నికల అధికారి అనుమతిలేని వారిని, గుర్తింపు లేని వారిని పోలింగ్ బూత్‌ల్లోకి అనుమతించవద్దని సూచించారు. ఎన్నికల ముందు రోజు నుంచి స్థానికేతరులు గ్రామాల్లో సంచరించకుండా ముందస్తు నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే సోషల్ మీడియాపై పూర్తి నిఘా ఉంచాలని అనుచిత ప్రవర్తన, అనుచిత పోస్టులు పెట్టిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని వెల్లడించారు. అక్రమ మద్యం, నగదు రవాణా, ఇతర విలువైన వస్తువుల రవాణా, బహుమతుల ప్రలోభాలను నిరోధించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఓటర్లు భాగస్వామ్యం కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాశ్, రవి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్, ఇన్‌స్పెక్టర్ రాజేశ్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సీఐలు, ఐటీ కోర్ కమ్యూనికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

## ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనపై టీఎమ్మార్పీఎస్ నిరసన

బొడ్రాయిబజార్, నవంబర్ 11 : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి పదేండ్లు అధికారంలో ఉండి వర్గీకరణ చేయని ప్రధాని మోదీ తెలంగాణాకు ఏ ముఖం పెట్టుకుని వచ్చినట్లని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములుమాదిగ ప్రశ్నించారు. ప్రధాని మోదీ హైదరాబాద్ రావడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండుసార్లు ఎస్సీ వర్గీకరణపై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా చట్టబద్దత కల్పించలేదని దుయ్యబట్టారు. మాదిగలను నమ్మించి వంచించిన మోదీని తెలంగాణ మాదిగలు నమ్మరని, అంతా ఏకమై తగిన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు బొడ్డు సైదమ్మ, సూర్యాపేట నియోజక వర్గ ఇన్‌చార్జి బొడ్డు మల్సూర్, జిల్లా ఉపాధ్యక్షుడు పాతకొట్ల రమేశ్, పట్టణ అధ్యక్షుడు పిడమర్తి మధు, నెమ్మాది సైదులు, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.